సాక్షి తిరుపతి

సోమవారం । 15 । సెప్టెంబర్ । 2025



అధ్వాన్నం.. అవస్థలమయం

కూటమి ప్రభుత్వంలో రోడ్ల నిర్వహణ అధ్వాన్నంగా తయారైంది. మరమ్మతులు చేసినా నాణ్యతలోపిస్తోంది. - 8లో



క్రేజ్ తగ్గిన పీజీ

కూటమి ప్రభుత్వం ఉన్నత విద్యను సర్వనాశనం చేసింది. పీజీ అడ్మిషన్లపై శీతకన్ను వేసింది. - 8లో



రుయా.. కటిక నేలే దిక్కయా!

రుయా ఆస్పత్రిలో రోగుల సహాయకుల పరిస్థితి దారుణంగా ఉంది. విశ్రమించేందుకు కటిక నేలే శరణ్యమవుతోంది. - 8లో

న్యూస్‌రీల్

గవర్నర్‌కు సాదర స్వాగతం



గవర్నర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న జేసీ

రేణిగుంట : తిరుపతి పర్యటనలో భాగంగా జాతీయ మహిళా సాధికారత సదస్సులో పాల్గొనేందుకు ఆదివారం రేణిగుంట విమానాశ్రయానికి గవర్నర్ అబ్దుల్ నజీర్ చేరుకున్నారు. జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, అడిషనల్ ఎస్పీ రవి మనోహరాచారి, శ్రీకాళహస్తి ఆర్డీఓ భాను ప్రకాష్ రెడ్డి, రేణిగుంట తహసీల్దార్ చంద్రశేఖర్ రెడ్డి సాదరంగా స్వాగతం పలికారు.

నేడు కలెక్టరేట్‌లో 'గ్రీవెన్స్' రద్దు

తిరుపతి అర్బన్ : ప్రజా సమస్యల పరిష్కారం కోసం కలెక్టరేట్‌లో నిర్వహించే గ్రీవెన్స్‌ను సోమవారం రద్దు చేసినట్లు డీఆర్‌ఓ నరసింహులు తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ జాతీయ మహిళా సాధికార సదస్సు నేపథ్యంలో అధికారులందరూ వివిధ విధుల్లో ఉన్న కారణంగా ప్రజా సమస్యల పరిష్కార వేదిక ఉండదని వివరించారు. అర్జీదారులు కలెక్టరేట్, మండల కార్యాలయాలకు వెళ్లవద్దని సూచించారు. అయితే దీనిపై ముందస్తుగానే ప్రజలకు సమాచారం అందించి ఉండాల్సిందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

ఏయూఎన్‌టీఈఏ నూతన కార్యవర్గం ఎన్నిక






కొత్త కార్యవర్గం

తిరుపతి సిటీ : ఏపీ ఆల్ యూనివర్సిటీస్ నాన్ టీచింగ్ ఎంప్లాయిస్ నూతన కార్యవర్గం ఎంపికైంది. ఆదివారం అనంతపురం ఎస్కే యూనివర్సిటీలో కార్యవర్గ ఎన్నిక చేపట్టినట్లు ఎన్నికల అధికారి గుర్రంకొండ శ్రీధర్ తెలిపారు. అధ్యక్షుడిగా ఎస్కే వర్సిటీకి చెందిన తిమ్మప్ప, జనరల్ సెక్రటరీగా ఎస్వీయూకు చెందిన ఎస్.సుబ్రమణ్యం, మీడియా కో–ఆర్డినేటర్‌గా ఎస్వీయూకు చెందిన మనోజ్‌కుమార్ ఎన్నికైనట్లు వెల్లడించారు.

తిరుమలలో భద్రతపై స్పెషల్ డ్రైవ్

తిరుమల : శ్రీవారి బ్రహ్మోత్సవాల నేపథ్యంలో భద్రతను దృష్టిలో ఉంచుకుని టీటీడీ విజిలెన్స్, హెల్త్, శానిటేషన్, పోలీసులు సంయుక్తంగా ఆదివారం స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. కల్యాణ కట్ట, ఎస్వీ షాపింగ్ కాంప్లెక్స్ ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించారు. 82 మంది యాచకులు, అనధికార వ్యాపారులను గుర్తించి తిరుపతికి పంపించారు. స్థానిక హోటళ్లు, టీ దుకాణాలు, చిల్లర దుకాణాల యజమానులు తమ వద్ద పనిచేసే వారికి తిరుపతిలోనే వసతి కల్పించాలని ఆదేశించారు.

పకడ్బందీగా బ్రహ్మోత్సవ ఏర్పాట్లు



ఏర్పాట్లు పరిశీలిస్తున్న చైర్మన్, ఈఓ తదితరులు

తిరుమల : శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలకు పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నట్లు టీటీడీ బోర్డు చైర్మన్ బీఆర్ నాయుడు తెలిపారు. ఈఓ అనిల్ కుమార్ సింఘాల్, అదనపు ఈఓ సీహెచ్ వెంకయ్యచౌదరితో కలిసి ఆదివారం సాయంత్రం శ్రీవారి ఆలయ మాడవీధుల్లో ఏర్పాట్లను పరిశీలించారు. చైర్మన్ మాట్లాడుతూ బ్రహ్మోత్సవాలను ప్రతిష్టాత్మకంగా తీసుకుని సర్వం సిద్ధం చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ నెల 24 నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు నిర్వహించనున్న వైకుంఠనాథుని ఉత్సవాల్లో భక్తులకు చిన్నపాటి అసౌకర్యం కూడా తలెత్తకుండా చర్యలు చేపడుతున్నట్లు వివరించారు. వాహన సేవలను ప్రతి ఒక్కరూ తిలకించేలా 35 ఎల్‌ఈడీ స్క్రీన్లు ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు. సీవీఎస్‌ఓ మురళీకృష్ణ, సీఈ సత్యనారాయణ, ఈఈ సుబ్రమణ్యం, డిప్యూటీ ఈఓలు లోకనాథం, రాజేంద్ర కుమార్, సోమన్నారాయణ పాల్గొన్నారు.

డిగ్రీ సీట్ల కేటాయింపు రేపు

తిరుపతి సిటీ : జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు, టీటీడీ డిగ్రీ కళాశాలల్లో పలు కోర్సులలో ప్రవేశాలకు సంబంధించి ఉన్నత విద్యామండలి వ్యవహరిస్తున్న తీరుపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికే సీట్ల కేటాయింపు ప్రక్రియను పలు మార్లు వాయిదా వేశారు. ఈ క్రమంలో సోమవారం అధికారికంగా విద్యార్థులకు సీట్ల కేటాయింపుపై మేసేజ్‌లు పంపనున్నట్లు తెలిపారు. దీంతో సీట్లు పొందిన విద్యార్థులు ఆయా కళాశాలల్లో మంగళవారం రిపోర్టు చేయాల్సి ఉంటుంది.

అక్షరమే ఆయుధం



పాత్రికేయులను భయపెడుతున్నారు



ప్రజలకు జరుగుతున్న అన్యాయాలను పత్రికల్లో రాసినందుకే విలేకరులపై ప్రతాపం చూపుతున్నారు. ప్రజాస్వామ్యంలో పత్రికలు కీలకంగా పనిచేస్తాయి. ప్రజాపక్షాన నిలబడే పత్రికలపై జులుం ప్రదర్శిస్తున్నారు. పత్రికా స్వేచ్ఛకు భంగం కలిగిస్తున్నారు. పాత్రికేయులను భయపెడుతున్నారు. అడ్డగోలుగా కేసులు పెడుతున్నారు. నిజాలను వెలుగులోకి తీసుకురావడం ప్రతికల హక్కు. ఆ హక్కును హరించడం దారుణం. ఇది ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టు. పత్రికలపై పెట్టిన కేసులను వెంటనే వెనక్కి తీసుకోవాలి. రాష్ట్రంలో విషసంస్కృతిని తీసుకువస్తున్నారు. విలేకరులకు స్వేచ్ఛ ఇవ్వాలి. లేకుంటే భవిష్యత్‌లో తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుంది.

– లలితా థామస్, మాజీ ఎమ్మెల్యే, పలమనేరు

ప్రజాస్వామ్యం ఖూనీ



ప్రజలకు వాస్తవాలను తెలిపే పత్రికలపై కూటమి ప్రభుత్వం కేసులు పెట్టడం, దాడులు చేయడం, వేధించడమంటే ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమే. కూటమి ప్రభుత్వ వైఫల్యాలు, అక్రమాలు, అరాచకాలపై రాజకీయ నాయకులు ఇచ్చిన స్టేట్‌మెంట్లు, ప్రసంగాలను సాక్షి దిన పత్రికలో ప్రచురించారనే ఆరోపణలతో పోలీసులు కేసులు నమోదు చేయడం విడ్డూరంగా ఉంది. పత్రిక, ఎడిటర్, సిబ్బందిని నిందితులుగా చేర్చడం కూటమి ప్రభుత్వ నిరంకుశ వైఖరికి నిదర్శనం. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా వారి లోపాలను ఎత్తిచూపే పత్రికలపై కేసులు పెట్టి, వేధించడం దారుణం. ఈ పద్ధతి ఇలాగే కొనసాగితే ప్రజాస్వామ్యంలో నాలుగో స్తంభమైన పత్రికలు నిర్వీర్యమైపోతాయి. అధికారబలం ఉన్నవాడికే జీవించే హక్కు లభిస్తుంది. ప్రభుత్వం ఇప్పటికైనా ఈ విషయంలో పునరాలోచించాలి. ప్రజాస్వామ్యబద్ధంగా పాలించాలి.

– బియ్యపు మధుసూదన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే, శ్రీకాళహస్తి

వివాదంలో మునగంగ!



మహిమాన్వితమైన తిరుపతి తాతయ్యగుంట గంగమ్మను ప్రజలు అత్యంత భక్తిశ్రద్ధలతో కొలుస్తుంటారు. ప్రతి సంవత్సరం అంగరంగ వైభవంగా జాతర నిర్వహిస్తుంటారు. వివిధ వేషాలు ధరించి అమ్మవారి మొక్కులు చెల్లించుకుంటూ ఉంటారు. తిరుమల శ్రీవారికి చెల్లెలు అయిన శక్తిస్వరూపిణిని కీర్తిస్తుంటారు. అంతటి ప్రసిద్ధి చెందిన ఆలయానికి పాలక మండలి ఏర్పాటులో ప్రభుత్వం చేసిన తప్పిదం వివాదాస్పదంగా మారింది. జాతరలో కీలకపాత్ర పోషించే రజకులకు కమిటీలో చోటు దక్కకపోవడం చర్చనీయాంశంగా మారింది. ఆనవాయితీని గాలికి వదిలేయడంపై ఆందోళన వ్యక్తమవుతోంది. ఇదే సమయంలో కూటమిలో సైతం చిచ్చు రేగింది. నేతల నడుమ ఆధిపత్య పోరు తారస్థాయికి చేరింది.

- తిరుపతి తాతయ్యగుంట గంగమ్మ ఆలయ పాలకమండలిలో వివక్ష
- జాతరలో రజకుల పాత్ర కీలకం.. అయినప్పటికీ దక్కని చోటు
- తమ వారికి ప్రాధాన్యమివ్వలేదని మాజీ ఎమ్మెల్యే ఆగ్రహం
- చంద్రబాబుకు ఫిర్యాదు.. బోర్డును రద్దు చేయాలని డిమాండ్
- విమర్శలు వెల్లువెత్తిన నేపథ్యంలో హడావుడిగా పాలకమండలి ప్రమాణస్వీకారం

సాక్షి ప్రతినిధి, తిరుపతి : తిరుపతి తాతయ్య గుంట గంగమ్మ ఆలయ పాలకమండలి నియామకం చుట్టూ వివాదం ఏర్పడింది. చరిత్రలో ఎన్నడూ లేని విధంగా కూటమి ప్రభుత్వం వచ్చాక ఏర్పాటైన బోర్డులో రజకులకు చోటు కల్పించకపోవడంపై నగరవాసులు చర్చించుకుంటున్నారు. మరోవైపు తమ అనుచరులకు ప్రాధాన్యత లేదని మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ అలకబూనారు. అయితే ఇవేమీ పట్టించుకోకుండా ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహయాదవ్, శాప్ చైర్మన్ రవినాయుడు ఆధ్వర్యంలో హడావుడిగా పాలకమండలి ప్రమాణ స్వీకారోత్సవం నిర్వహించడంపై ఇటు రజకులు, అటు టీడీపీ నేతలు మండిపడుతున్నారు.



ప్రమాణస్వీకారం చేస్తున్న కొత్త కమిటీ

రజకుల సభ్యత్వానికి తిలోదకాలు

జిల్లాలోని చారిత్రాత్మకమైన ఆలయాల్లో తిరుపతి తాతయ్య గుంట గంగమ్మ దేవాలయం ఒకటి. తిరుమలలో కొలువైన శ్రీవేంకటేశ్వరునికి గంగమతల్లి స్వయాన చెల్లెలు. ఈ క్రమంలోనే ఏటా వైభవంగా నిర్వహించే తాతయ్య గుంట గంగమ్మ జాతరకు తిరుమల శ్రీనివాసుడు సారె పంపడం ఆనవాయితీ. ఆ మేరకు గంగమ్మ ఆలయ పాలకమండలికి ప్రత్యేక గుర్తింపు ఉంది. అయితే జాతరలో కీలక పాత్ర పోషించే తమకు తీవ్రమైన అవమానం జరిగిందని రజకులు రగిలిపోతున్నారు. బోర్డులో రజకుల సభ్యత్వానికి తిలోదకాలివ్వడంపై ఆవేదన చెందుతున్నారు. కూటమి ప్రభుత్వం వివక్ష చూపడంపై భగ్గుమంటున్నారు. ప్రస్తుతం ఏర్పాటైన పాలక మండలిని బహిష్కరిస్తున్నట్లు ప్రకటించారు.

అలక వహించిన సుగుణమ్మ!

తాతయ్య గుంట గంగమ్మ ఆలయ పాలకమండలిలో తమ వారికి చోటు దక్కలేదని మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ అలక వహించినట్లు విశ్వసనీయ సమాచారం. ప్రెస్ క్లబ్‌లో టీడీపీ నగర మహిళ అధ్యక్ష, కార్యదర్శులు సూర్యకుమారి, అనిత తదితరులు విలేకరుల సమావేశంలో చేసిన వ్యాఖ్యలే ఇందుకు నిదర్శనం. వారు మాట్లాడుతూ పార్టీ కోసం పనిచేసిన వారిని పక్కనపెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. టీడీపీతో సంబంధమే లేని వారికి పాలకమండలిలో చోటు కల్పించారని మండిపడ్డారు. బోర్డు ప్రమాణస్వీకారాన్ని రహస్యంగా, హడావుడిగా చేయడమేంటని ప్రశ్నించారు. ఈ విషయాలను సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లనున్నట్లు స్పష్టం చేశారు. దీనిపై ఇప్పటికే టీడీపీ అధిష్టానానికి మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ ఫిర్యాదు చేసినట్లు సమాచారం. ఈ మేరకే ఎక్కడ పాలక మండలి రద్దవుతుందనే ఆందోళనతో హడావుడిగా ప్రమాణస్వీకారం చేయించారని టీడీపీ కార్యకర్తలు అభిప్రాయపడుతున్నారు.

మాజీ ఎమ్మెల్యేపై జనసేన నేతల విమర్శలు

టీడీపీ మహిళా నేతలు ప్రెస్‌మీట్ పెట్టిన కొంత సమయానికే జనసేన నేతలు మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మకు వ్యతిరేకంగా సోషల్ మీడియాలో పోస్టులు పెట్టడం ప్రారంభించారు. ఆమె కారణంగానే టీడీపీ భ్రష్టుపట్టిందని ఆరోపణలు చేశారు. స్వార్థ ప్రయోజనాల కోసం టీడీపీ నిజమైన కార్యకర్తలను గొంతకోసి అధికారం అనుభవిస్తున్నారని విమర్శలకు దిగారు. తిరుపతిలో రూ.వేల కోట్ల విలువైన వందల ఎకరాలను కొట్టేసింది నిజం కాదా? తిరుమలలో రోజా దర్శన లెటర్లను అమ్ముకున్నది నిజం కాదా? అంటూ ప్రశ్నించారు. టికెట్ ఇవ్వలేదని టీడీపీ జెండాలను తగులబెట్టించలేదా? చంద్రబాబు నాశనం అయిపోతారని శాపనార్థాలు పెట్టింది నిజం కాదా? అని నిలదీస్తున్నారు. గంగమ్మ గుడి చైర్మన్ పదవి ఇప్పిస్తానని రూ.20 లక్షలు వరకు వసూలు చేసింది నిజం కాదా? అంటూ తీవ్ర స్థాయిలో ట్రోల్స్ చేశారు. మొత్తంగా తిరుపతి తాతయ్య గుంట గంగమ్మ ఆలయ పాలకమండలి నియామకం వివాదాస్పదంగా మారడం గమనార్హం.

దోచుకోవడం.. దాచుకోవడం

- ప్రకృతి వనరులను కొల్లగొడుతున్న కూటమి నేతలు
- అభివృద్ధిని గాలికి వదిలేసిన ప్రభుత్వం
- మాజీ మంత్రి కాకాణి గోవర్ధనరెడ్డి



మాట్లాడుతున్న కాకాణి పక్కనే మేరిగ, పర్వతరెడ్డి

చిల్లకూరు : రాష్ట్రాభివృద్ధిని ప్రభుత్వం గాలికి వదిలేసిందని, కూటమి నేతలు ప్రకృతి వనరులను దోచుకోవడం, దాచుకోవడమే లక్ష్యంగా పెట్టుకున్నారని మాజీ మంత్రి కాకాణి గోవర్ధనరెడ్డి ఆరోపించారు. సర్కారు అక్రమంగా పెట్టిన కేసుల్లో చిక్కుకుని విడుదలైన వేమారెడ్డి కుమారస్వామి రెడ్డి, వారి తల్లి శారదమ్మను ఆయన పరామర్శించారు. ఆదివారం ఈ మేరకు చిల్లకూరు మండలం మోమిడి గ్రామానికి వెళ్లారు. ఈ సందర్భంగా విలేకర్లతో మాట్లాడుతూ ప్రశాంతమైన ఉమ్మడి నెల్లూరు జిల్లాను అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మార్చేశారని మండిపడ్డారు. జిల్లాలో రోజూ ఎక్కడో ఓ చోట హత్యలు, దాడులు, గంజాయి విక్రయాలు సాగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి గతంలో సిలికాలో దోపిడీ జరుగుతోందని గగ్గోలు పెట్టారని, ఇప్పుడు ఆయనే కోట మండలం కర్లపూడిలో సిలికా మైన్లు తీసుకునేందుకు యత్నిస్తున్నారని విమర్శించారు. దీన్ని అడ్డుపెట్టుకుని సమీపంలోని ఏపీఐఐసీ భూముల్లో సైతం సిలికాను తవ్వేసి అమ్మేసుకునేందుకు పథకం వేశారని స్పష్టం చేశారు. ఈ ప్రభుత్వంలో తిరుపతి, నెల్లూరు జిల్లాలు గ్రావెల్, మట్టి, సిలికా, ఇసుక దోపిడీకి కేంద్రాలుగా మారినట్టు వెల్లడించారు. నేరుగా ప్రజా ప్రతినిధులే రంగంలోకిదిగి, ఇసుకను తవ్వి తరలించి సొమ్ము చేసుకుంటున్నారని తెలిపారు. అడ్డుకునేందుకు యత్నించిన వైఎస్సార్‌సీపీ నేతలపై అక్రమంగా కేసులు బనాయిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ క్రమంలోనే కొందరిపై అన్యాయంగా రౌడీ షీట్‌లు ఓపెన్ చేస్తున్నారన్నారు. అక్రమంగా రౌడీ షీట్ నమోదైన వారు తన వద్దకు గానీ, ఆయా నియోజకవర్గాల సమన్వయకర్తల దృష్టికి గానీ తీసుకురావాలని కోరారు. అక్రమ కేసులు పెట్టిన వారిపై ప్రైవేట్ కేసులు వేసేందుకు వెనుకాడమని హెచ్చరించారు. కొత్తగా వచ్చిన ఎస్పీ సుబ్బారాయుడు పోలీస్ వ్యవస్థను గాడిలో పెట్టి, అక్రమ కేసులు బనాయించకుండా చూడాలని సూచించారు. సమావేశంలో ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర రెడ్డి, వైఎస్సార్‌సీపీ గూడూరు నియోజకవర్గ సమన్వయకర్త మేరిగ మురళీధర్, మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, నేతలు నల్లపరెడ్డి రజిత్‌రెడ్డి పాల్గొన్నారు.

17 నుంచి ప్రత్యేక వైద్య శిబిరాలు



మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ బాలకృష్ణనాయక్

తిరుపతి తుడా : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా ఈనెల 17 నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు స్వస్త్ నారీ స్వశక్త్ అభియాన్ కింద మహిళలకు ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించనున్నట్లు డీఎంహెచ్‌ఓ డాక్టర్ బాలకృష్ణ నాయక్ తెలిపారు. ఆదివారం ఈ మేరకు వైద్య ఆరోగ్యశాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ మహిళల ఆరోగ్య రక్షణతోపాటు కుటుంబాలను బలోపేతం చేసే లక్ష్యంతో ప్రణాళికలు సిద్ధం చేసినట్లు వెల్లడించారు. అందులో భాగంగా జిల్లాలోని గ్రామీణ, పట్టణ ఆరోగ్య కేంద్రాలు, ఆరోగ్య ఉప కేంద్రాలు, ఏరియా ఆస్పత్రులు, సామాజిక ఆరోగ్య కేంద్రాలలో ప్రత్యేక వైద్య శిబిరాలను నిర్వహించాలని ఆదేశించారు.

హత్యా.. ఆత్మహత్యా?

వీళ్లెవరు?..నట్టడివిలోకి ఎలా వచ్చారు..?. ప్రధాన రహదారి నుంచి అరణ్యంలోకి ఎలా చేరుకున్నారు..? పురుషుడికి చెట్టుకు ఉరివేసుకోవాల్సిన పరిస్థితి ఎందుకొచ్చింది...? ఆ పక్కనే ఉన్న మహిళ మృతదేహం ఎవరిది..?. వారికి సమీపంలోనే రెండు మృతదేహాలను పూడ్చిపెట్టిన స్థితిలో ఉన్న గుంతలేంటి..? వీళ్లంతా ఒకే కుటుంబం వారా..?. ఎవరైనా వీళ్లను ఇక్కడకు తీసుకొచ్చి హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరించారా..?. లేక ఏదైనా కష్టమొచ్చి బలవన్మరణానికి పాల్పడ్డారా..? పాకాల మండల శివారు.. జాతీయ ప్రధాన రహదారికి మూడు కిలోమీటర్ల దూరంలోని చిట్టడవిలో బయటపడిన మృతదేహాలు ఆదివారం కలకలం రేపాయి..

- అడవి మధ్యలో నాలుగు మృతదేహాలు
- ఒకే కుటుంబంగా అనుమానం
- తమిళనాడు వాసులేనా?

పాకాల: ఘటనా స్థలంలో మృతదేహాలు ఉన్న తీరు, పక్కనే రెండు గుంతల్లో మరో రెండు మృతదేహాలను పూడ్చి పెట్టినట్టు ఉన్న గుంతలు.. వాటిపై గుర్తుగా పెట్టిన రాళ్లు.. వీళ్లు ఒకే కుటుంబమా..? అనే అనుమానం కలుగుతోంది. వీరు నట్టడివిలోకి ఎలా వచ్చారు.. ఎలా మృతిచెందారు అనేదానిపై అనేక సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఓ కుటుంబాన్ని తీసుకొచ్చి ఇక్కడ చంపి ఆత్మహత్యగా చిత్రీకరించారా.. లేక ఏదైనా కష్టమొచ్చి కుటుంబం మొత్తం ఆత్మహత్యకు పాల్పడిందో తెలియడం లేదు. పాకాల మండలంలో బయటపడిన ఈ ఘటన జిల్లాలో చర్చనీయాంశంగా మారింది. పోలీసుల కథనం.. పాకాల మండల పరిధిలోని పవిత్ర హోటల్ వెనుక భాగంలో ఉన్న అటవీ ప్రాంతంలో కుళ్లిపోయిన రెండు మృతదేహాలను అటవీశాఖ సిబ్బంది గుర్తించి.. పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే పవిత్ర హోటల్ నుంచి సుమారు 3కిలో మీటర్ల దూరంలో ఉన్న ఘటనా స్థలానికి సీఐ సుదర్శన్‌ప్రసాద్ తన సిబ్బందితో చేరుకుని పరిశీలించారు. అక్కడ ఒక పురుషుడి మృతదేహం చెట్టుకు వేలాడుతోంది. సమీపంలోనే మహిళ మృతదేహం కింద పడి ఉంది. అక్కడే మరో ఇద్దరిని పూడ్చి పెట్టిన ఆనవాళ్లు కనిపించాయి. ఆ గుంతలపై గుర్తుగా బండరాళ్లు పెట్టి ఉన్నారు. గుంతలను తవ్వేందుకు ఉపయోగించిన పారను చెట్ల పొదల్లో పడేసి ఉన్నారు.



శవాలను పూడ్చినట్టు అనుమానిస్తున్న ప్రదేశం

అడవిలో ఏం జరిగింది?

పాకాల మండలం శివారు ప్రాంతం అడవిలోని నామాల బండ సమీపం, మూలకుంట వద్ద ఇద్దరి మృతదేహాలతోపాటు చిన్న పిల్లలను గుంతలో పూడ్చి పెట్టిన ఆనవాళ్లు ఉన్నాయి. ఘటనా స్థలంలో పిల్లల దుస్తులు కనిపించాయి.

తమిళనాడు వాసులేనా?

మృతదేహాల వద్ద ఓ నోకియో ఫోన్ లభించింది. అలాగే క్లైౖ సెల్వన్ పేరు మీదున్న తంజావూరు క్రిస్ ఆస్పత్రి ప్రిస్క్రిప్షన్ లభ్యమైంది. మృతులు తమిళనాడు వాసులుగా పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఇవన్నీ చూస్తుంటే నయం కాని జబ్బు ఏదైనా బయటపడిందా..? పోలీసుల విచారణలో తేలాల్సి ఉంది. ఇదిలావుండగా మృతదేహాలు దొరికిన ప్రాంతం పాకాల మండల పరిధిలో లేకపోవడంతో కేసును చంద్రగిరి పోలీసులకు అప్పగించినట్టు సమాచారం.

సమానత్వం దిశగా అడుగులు

- తిరుపతిలో తొలి మహిళా సాధికారత సదస్సు శుభసూచికం
- లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా



సదస్సు సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా తదితరులు

తిరుపతి అర్బన్ : తొలి జాతీయ మహిళా సాధికారత సదస్సును తిరుపతిలో నిర్వహించడం శుభ సూచికమని, ఇదే స్ఫూర్తితో ఎలాంటి వివక్ష లేకుండా సమానత్వం దిశగా అడుగులు వేద్దామని లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా పిలుపునిచ్చారు. ఆదివారం తిరుచానూరులోని రాహుల్ కన్వెన్షన్ సెంటర్‌లో జాతీయ సదస్సు నిర్వహించారు. మూడురోజులపాటు నిర్వహించనున్న సదస్సులో ముందుగా జాతీయ, రాష్ట్ర గీతం ఆలపించి ప్రారంభించారు. పార్లమెంటరీ మహిళా సాధికారత కమిటీ అధ్యక్షులు పురందేశ్వరి, రాజ్యసభ ఉపాధ్యక్షుడు హరివంశ్, శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు, డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణంరాజు, ఎంపీ మద్దిల గురుమూర్తి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా లోకసభ స్పీకర్ మాట్లాడుతూ భక్తి, త్యాగం, మహిళా కృషికి తిరుపతి ప్రతీకని తెలిపారు. అందుకే తొలి సమావేశానికి తిరునగరాన్ని ఎంపిక చేసినట్లు వెల్లడించారు. వికసిత్ భారత్–2047కి స్వాతంత్రం వచ్చి వందేళ్ల గడుస్తోందన్నారు. భారత్ అభివృద్ధిలో మహిళాశక్తి ప్రాధాన్యతను వివరించారు. అనంతరం రాజసభ ఉపాధ్యక్షుడు హరివంశ్ నారాయణ్ సింగ్ మాట్లాడుతూ తిరుపతి వేదికగా మహిళా సదస్సును నిర్వహించడం విజయానికి నాందిగా భావిస్తున్నామన్నారు. అన్ని రంగాల్లో మహిళలు రాణించాలని పిలుపునిచ్చారు. ఎంపీ గురుమూర్తి మాట్లాడుతూతిరుపతిలో మహిళా సాధికారత తొలి సదస్సును జరుపుకోవడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఈ సదస్సులో తీసుకోనున్న తీర్మానాల అమలుకు దేవుడి ఆశీస్సులు ఉండాలని కోరారు. పురంధేశ్వరి మాట్లాడుతూ దేశాభివృద్ధికి ప్రధాన మంత్రి నరేంద్రమోదీ సారథ్యంలో ముందడుగు పడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. మంత్రి పయ్యావుల కేశవ్ మాట్లాడుతూ మహిళలకు సురక్షితత, విద్య, నైపుణ్యాలు, అభివృద్ధిలో సమాన భాగస్వామ్యాన్ని కల్పించే దిశగా చట్ట సభ్యులందరినీ ఈ సదస్సు ఏకం చేస్తుందని తెలిపారు. శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ మహిళా సాధికారత కోసం సమాన అవకాశాలు, సురక్షిత సమాజం, గౌరవమైన జీవితం కల్పించాల్సిన అవసరం ఉందని వివరించారు. సాధికారత కమిటీ చైర్‌పర్సన్ గౌరు చరితా రెడ్డి మాట్లాడుతూ ఈ సదస్సు దేశవ్యాప్తంగా మహిళా సాధికారత విధానాలు తెలుసుకోవడానికి, అనుభవాలు పంచుకోవడానికి, సవాళ్లపై చర్చించడానికి ఒక వేదికగా ఉపయోగపడుతుందని వెల్లడించారు. డిప్యూటీ స్పీకర్ రఘు రామకృష్ణం రాజు మాట్లాడుతూ. తిరుపతిలో ఈ సమావేశం నిర్వహించడం చారిత్రాత్మకమైన ఘట్టమని తెలిపారు.



చంద్రగిరి కోటలో సాంస్కృతిక కార్యక్రమం



వివిధ రాష్ట్రాల నుంచి తరలివచ్చిన డెలిగేట్స్

చంద్రగిరి కోటలో..

చంద్రగిరి కోట వద్ద ఆదివారం రాత్రి పలు సాంస్కృతిక కార్యక్రమాలను చేపట్టారు. గవర్నర్ అబ్దుల్ నజీర్ సోమవారం సదస్సుకు హాజరుకానున్నారు. రెండవ రోజు రాహుల్ కన్వెన్షన్‌లోనే ముగింపు సభ నిర్వహించనున్నారు. కార్యక్రమంలో కలెక్టర్ వెంకటేశ్వర్, పలువురు ఎమ్మెల్యేలు, అధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

విశ్రాంత ఉద్యోగి ఇంట్లో చోరీ

- కేజీ వెండి, 50 సవర్ల బంగారం, రూ.5లక్షల నగదు అపహరణ



బీరువాలోని వస్తువులను చిందరవందరంగా పడేసిన దృశ్యం

చంద్రగిరి : స్థానిక ప్రశాంతినగర్‌లోని సీఆర్‌పీఎఫ్ విశ్రాంత హెడ్ కానిస్టేబుల్ నజీర్ ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడిన ఘటన ఆదివారం వెలుగుచూసింది. వివరాలు.. నజీర్ కుటుంబ సభ్యులతో కలసి శనివారం పాకాల మండలం రమణయ్యగారిపల్లెలోని బంధువుల ఇంటికి వెళ్లారు. అక్కడ నుంచి ఆదివారం సాయంత్రం ఇంటికి తిరిగి వచ్చారు. తలుపులు పగలగొట్టి ఉండడంతో చోరీ జరిగినట్లు గుర్తించారు. వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. బీరువాలోని కిలో వెండి, 50 సవర్ల బంగారు ఆభరణాలు, రూ.5లక్షల నగదును దుండగులు అపహరించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని వేలిముద్రలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చట్టాలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న కపిలవాయి విజయ్‌కుమార్

తిరుపతి కల్చరల్ : బంగారు వ్యాపారులకు చట్టాలపై అవగాహన అవసరమని ఏపీ బులియన్ గోల్డ్ సిల్వర్ అండ్ మర్చంట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కపిలవాయి విజయ్‌కుమార్ తెలిపారు. ఆదివారం తిరుపతిలోని ఓ ప్రైవేట్ హోటల్‌లో సంఘం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బంగారు వ్యాపారుల సంక్షేమమే లక్ష్యంగా అసోసియేషన్ నిరంతరం కృషి చేస్తోందన్నారు. అయితే ఇకేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన చట్టాలపై అవగాహన లేక వ్యాపారులు తీవ్రంగా నష్టపోతున్నారని వెల్లడించారు. వ్యాపారులందరికీ చట్టాలపై అవగాహ కల్పించాలనే లక్ష్యంతో ఈ సమావేశం ఏర్పాటు చేశామన్నారు. అనంతరం బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ (బీఐఎస్) జాయింట్ డైరెక్టర్ శశాంక్ మాట్లాడుతూ హాల్ మార్క్ యూనిక్ ఐడెంటిఫికేషన్ కోడ్‌పై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. నవంబర్ 21, 11, 23వ తేదీల్లో విజయవాడలో జ్యువెలరీ ఎగ్జిబిషన్ చేపట్టేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. సమావేశంలో అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.శంకరరావు, కోశాధికారి అనిల్‌కుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షులు కేవీ.సత్యనారాయణ, ఎస్.జితేంద్ర కుమార్, కార్యదర్శి బాబు, పీఆర్‌ఓ శివ, భాస్కర్, రమణ, వంశీ పాల్గొన్నారు.

శ్రీవారి దర్శనానికి 24 గంటలు

తిరుమల : తిరుమలలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు నిండిపోవడంతో కృష్ణ తేజ అతిథిగృహం వరకు భక్తులు బారులు తీరారు. శనివారం అర్ధరాత్రి వరకు 82,149 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 36,149 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. శ్రీవారికి కానుకల రూపంలో హుండీ ద్వారా రూ.3.85 కోట్ల ఆదాయం వచ్చింది. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. టికెట్లు లేని వారికి 24 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ టికెట్లు ఉంటే 3 గంటల్లో దర్శనమవుతోంది. ఈ క్రమంలోనే సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికే క్యూలోకి వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది.

క్రేజ్ తగ్గిన పీజీ

- 32వేల సీట్లకు 9,765 దరఖాస్తులు



ఎస్వీయూ పరిపాలన భవనం

తిరుపతి సిటీ : రాష్ట్రంలో ఉన్నత విద్యను కూటమి ప్రభుత్వం సర్వనాశనం చేస్తోంది. పీజీ సెట్–2025 కౌన్సెలింగ్ ప్రక్రియకు వచ్చిన దరఖాస్తులను చూస్తే ఈ విషయం స్పష్టమవుతోంది. గత ఏడాది నుంచి రాష్ట్ర వ్యాప్తంగా అన్ని వర్సిటీల్లో అడ్మిషన్లు కనీసం 50శాతం మించలేదు. 2025–26 విద్యాసంవత్సరానికి సంబంధించి పీజీ సెట్ కౌన్సెలింగ్ నిర్వహణపై నిర్లక్ష్యం వహించడంతో పరిస్థితి మరింత దారుణంగా తయారైంది. ఈ ఏడాది వర్సిటీలలో కనీసం 20శాతం అడ్మిషన్లు దాటడమే గగనంగా మారింది. ఉన్నత విద్యామండలి నిర్ణయాల ఫలితంగా విద్యార్థులు పీజీపై అనాసక్తి చూపుతున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 17 యూనివర్సిటీలలో సైన్స్, ఆర్ట్స్, కంప్యూటర్ విభాగాలలోని పీజీ కోర్సులల్లో సుమారు 32వేలకు పైగా సీట్లు ఉండగా ఇప్పటి వరకు కేవలం 9,765 మంది విద్యార్థులు మాత్రమే రిజిస్ట్రేషన్ చేసుకోవడం గమనార్హం.

ఎస్వీయూ పరిధిలో వెయ్యిలోపే..!

పీజీ సెట్ కౌన్సెలింగ్ కోసం ఉన్నత విద్యామండలి సోమవారం వరకు రిజిస్ట్రేషన్ ప్రక్రియకు గడువు విధించింది. ఎస్వీయూ పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల్లో సుమారు 4వేల సీట్లు ఉండగా, ఇప్పటి వరకు కేవలం 955 దరఖాస్తులు మాత్రమే రావడం గమనార్హం. ఇలాంటి దుస్థితిని గతంలో ఎన్నడూ చూడలేదని విద్యార్థి సంఘాలు, మేధావులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పీజీ కోర్సులను నిర్వీర్యం చేసే ప్రయత్నంలో భాగంగానే ఉన్నత విద్యామండలి ఇలాంటి వాతావరణ కల్పించిందని ఆరోపిస్తున్నారు.

గడువు పెంచే ఆలోచనలో అధికారులు

పీజీసెట్–2025 రిజిస్ట్రేషన్ ప్రక్రియకు ఈ నెల 8 నుంచి 15 తేదీ వరకు ఉన్నత విద్యామండలి అనుమతించింది. అయితే ఆశించిన స్థాయిలో దరఖాస్తులు రాకపోవడంతో మరో మారు గడువు పెంచనుంది. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని వర్సిటీలో కేవలం 15శాతం మాత్రమే దరఖాస్తులు రావడంతో దిక్కుతోచని స్థితిలో ఉన్నత విద్యామండలి అధికారులు ఉన్నారు. కనీసం 50శాతం ప్రవేశాలను తీసుకురావాలని పీజీ సెట్ కన్వీనర్‌ను అధికారులు ఆదేశించినట్లు తెలుస్తోంది. ఇలాంటి పరిస్థితిలో పీజీ అడ్మిషన్లు చేపట్టలేమని ఎస్వీయూ మాత్రం చాకచక్యంగా చేతులెత్తేసింది. దీంతో ఉన్నత విద్యామండలి ఆ ప్రక్రియను నాగార్జున యూనివర్సిటీకి అప్పగించింది.

వర్సిటీల పరిస్థితి అగమ్య గోచరమే..!

గ్రామీణ, పేద, బడుగు బలహీన వర్గాలకు ఉన్నత విద్యను దూరం చేసేందుకు కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోంది. అందులో భాగంగానే గత ఏడాది నుంచి అడ్మిషన్లు భారీ స్థాయిలో పడిపోతున్నాయి, ప్రభుత్వ నిర్ణయాల కారణంగా ఎంఏ, ఎమ్మెస్సీ, ఎంకామ్ వంటి కోర్సులకు క్రేజ్ తగ్గుతోంది. విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్ షిప్‌లు, పరిశోధకలుకు ప్రోత్సాహకాలు కల్పించకపోవడంతో విద్యార్థులు సాధారణ పీజీ కోర్సులపై మొగ్గు చూపడం లేదని స్పష్టమవుతోంది. దీంతో రాబోయే రోజులలో యూనివర్సిటీల మనుగడ ప్రశ్నార్థకంగా మారే ప్రమాదం ఉందని విశ్లేషకులు, మేధావులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నేడు డీఎస్సీ అభ్యర్థుల తుది ఎంపిక జాబితా

- మొదట్లో ఇవ్వాల్సిన జాబితా చివర్లో...
- కూటమి ప్రభుత్వం వింత పోకడ
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న డీఎస్సీ అభ్యర్థులు

చిత్తూరు కలెక్టరేట్ : ఏ పోటీ పరీక్ష నిర్వహించినా ఎంపిక జాబితా మొదట్లో ప్రకటించడం ఆనవాయితీ. అయితే ఇందుకు విరుద్ధంగా కూటమి ప్రభుత్వం వింత పోకడ అమలు చేసింది. మూడు విడతల్లో సర్టిఫికెట్ల వెరిఫికేషన్ అయిన తర్వాత చివర్లో ఎంపిక జాబితా ప్రచురిస్తోంది. ఈ మేరకు ఆదివారం మెగా డీఎస్సీ కన్వీనర్ వెంకట కృష్ణారెడ్డి ఒక ప్రకటన విడుదల చేశారు. ఆ ప్రకటనలో ఈనెల 15వ తేదీన మెగా డీఎస్సీలో ఎంపికైన అభ్యర్థుల తుది జాబితా ప్రచురిస్తామని పేర్కొన్నారు.

లోలోపలే గోల్‌మాల్ .....

పారదర్శకంగా నిర్వహించాల్సిన డీఎస్సీ ప్రక్రియను కూటమి ప్రభుత్వం పక్కదారి పట్టించింది. పరీక్షల ఫలితాలు వెల్లడించిన తర్వాత ఎంపిక జాబితాలను రోస్టర్, మెరిట్ ప్రకారం ప్రచురించాల్సి ఉంటుంది. అయితే అలా చేయకుండా విడతల ప్రకారం పలు జాబితాలను ప్రచురించి గందరగోళం సృష్టించారు. లోలోపలే తమ కు అనుకూలమైన వారికి పోస్టులు ముట్ట చెప్పేందుకు కుట్రలు పన్నారని పలువురు అభ్యర్థులు ఆరోపిస్తున్నారు. జిల్లా స్థాయిలో జరగాల్సిన డీఎస్సీ ఎంపిక ప్ర క్రియను రాష్ట్ర స్థాయిలో నిర్వహించడం వల్ల అనేక అనుమానాలకు తావిచ్చింది.

నేడు తుది ఎంపిక జాబితాలు విడుదల.....

నెలల తరబడి నిర్వహించిన కసరత్తు అనంతరం ఈనెల 15న జిల్లాలో మెగా డీఎస్సీకి ఎంపిక అయిన అభ్యర్థుల తుది జాబితాను ప్రచురించనున్నారు. ఈ జాబితాలను కలెక్టర్ కార్యాలయం, డీఈవో కార్యాలయంలో నోటీసు బోర్డులో పెట్టనున్నారు. అదే విధంగా డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఏపీడీఎస్సీ.ఏపీసీఎఫ్ఎస్ఎస్.ఇన్ వెబ్‌సైట్‌లో తుది జాబితాను అప్‌లోడ్ చేయనున్నారు.

డీఎస్సీ ఉమ్మడి జిల్లా సమాచారం	
ఉమ్మడి చిత్తూరు జిల్లాలో నోటిఫైడ్ పోస్టులు	1473
మొదటి విడతలో పరిశీలన చేసిన సర్టిఫికెట్లు	1394
రెండవ విడతలో పరిశీలన చేసిన సర్టిఫికెట్లు	45
మూడవ విడతలో పరిశీలన చేసిన సర్టిఫికెట్లు	23

బ్యాగ్ నుంచి నగదు చోరీ

శ్రీకాళహస్తి : శ్రీకాళహస్తి ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఆదివారం ఒక మహిళ బ్యాగు నుంచి రూ.3.85లక్షలను గుర్తు తెలియని వ్యక్తులు అపహరించారు. సీసీ ఫుటేజీని పరిశీలించగా ఓ మహిళ మరో బాలుడి సాయంతో చోరీకి పాల్పడినట్లు తెలిసింది. నిందితుల ఆచూకీ తెలిసిన వారు 944090008 నంబర్‌కు సమాచారం అందించాలని టూటౌన్ సీఐ నాగార్జునరెడ్డి కోరారు.

డేటా సైన్స్ సెంటర్‌లో ముగిసిన సదస్సు



సర్టిఫికెట్లు అందిస్తున్న శాస్త్రవేత్తలు

తిరుపతి రూరల్ : మండలంలోని తుమ్మలగుంట పంచాయతీలో నూతనంగా ఏర్పాటు చేసిన డేటా సైన్స్ సెంటర్‌లో ఐదు రోజులుగా నిర్వహిస్తున్న జాతీయ స్థాయి సదస్సు ఆదివారంతో ముగిసింది. ''స్టాటిస్టికల్ లెర్నింగ్ అండ్ డేటా సైన్స్ – ఫౌండేషన్స్ అండ్ అప్లికేషన్స్'' పేరిట చేపట్టిన సదస్సును మహిళా వర్సిటీ, ఇండియన్ సొసైటీ ఫర్ ప్రాబబిలిటీ అండ్ స్టాటిస్టిక్స్ (ఐఎస్‌పీఎస్), ఎస్వీయూ సంయుక్తంగా నిర్వహించాయి. ముందుగా ఎస్వీయూ ప్రొఫెసర్ ఎంపీశాస్త్రి జయంతిని పురస్కరించుకుని నివాళులర్పించారు. సదస్సు నిర్వాహక కార్యదర్శి డాక్టర్ ఎం.శివ పార్వతి మాట్లాడుతూ వివరణాత్మక నివేదికను సమర్పించారు. స్టాటిస్టికల్ సైన్స్ మౌలికాలు, మెషిన్ లెర్నింగ్, డేటా మైనింగ్, సిగ్నల్ ప్రాసెసింగ్, ఎన్టోపీ, యాక్చూరియల్ సైన్స్, నేచురల్ లాంగ్వేజ్ ప్రాసెసింగ్, పోర్ట్‌ఫోలియో ఆప్టిమైజేషన్, ఏఐ అంతరశాఖ అనువర్తనాలు వంటి విస్తృత అంశాలను చర్చించినట్లు వివరించారు. ఈ సదస్సులో పాల్గొన్న వారికి సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. కస్టమ్స్ అండ్ జీఎస్టీ అసిస్టెంట్ కమీషనర్ సి.విజయభాస్కర్, డైరెక్టర్ ఆఫ్ ప్లానింగ్, స్టాటిస్టిక్స్ ఎవాల్యుయేషన్ మాజీ జాయింట్ డైరెక్టర్ వై. దుర్గాప్రసాద్, ఎకనామిక్స్ అండ్ స్టాటిస్టికల్ సర్వీసెస్ మాజీ డైరెక్టర్ కల్లూరి నాగేశ్వరరావు, పాండిచ్చేరి యూనివర్సిటీ ప్రొఫెసర్ ఆఫ్ స్టాటిస్టిక్స్‌ఆర్. విష్ణువర్ధన్ , హిమాచల్ ప్రదేశ్ ఐఐటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ గణేష్ తలారి పాల్గొన్నారు.

• రుయా.. కటిక నేలే దిక్కయా!

రాయలసీమకే తలమానికమని చెప్పుకునే రుయా ఆస్పత్రిలో రోగులతోపాటు సహాయకులకు ఇబ్బందులు తప్పడం లేదు. కాసేపు విశ్రమించేందుకు కటిక నేలే శరణ్యంగా మారుతోంది. చికిత్సపొందుతున్న తమ వారిని కనిపెట్టుకుని చూసుకునేందుకు వరండాలే దిక్కవుతున్నాయి.
– సాక్షి ఫొటోగ్రాఫర్, తిరుపతి



వరండాలో నిద్రిస్తున్న రోగుల సహాయకులు

శాంతిభద్రతల రక్షణే లక్ష్యం



మాట్లాడుతున్న ఎస్పీ సుబ్బరాయుడు

తిరుపతి క్రైమ్ : శాంతిభద్రతల రక్షణే లక్ష్యంగా పనిచేస్తామని ఎస్పీ సుబ్బరాయుడు స్పష్టం చేశారు. ఆదివారం తిరుమల శ్రీవారిని ఆయన కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. అనంతరం తిరుపతిలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఎస్పీ మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలు అందిస్తామన్నారు. ఫ్రెండ్లీ పోలీసింగ్ అమలు చేస్తామని, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడేవారితో అత్యంత కఠినంగా వ్యవహరిస్తామని వెల్లడించారు. అలాగే మహిళల రక్షణకు పటిష్టమైన చర్యలు చేపడతామని తెలిపారు. షీటీమ్‌లను బలోపేతం చేస్తామని వివరించారు. సైబర్ నేరాలపై ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తామని చెప్పారు. డ్రగ్స్ ఫ్రీగా తిరుపతిని తీర్చిదిద్దేందుకు పటిష్టమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

పకడ్బందీ బందోబస్తు

తిరుమలలో శ్రీవారి బ్రహ్మోత్సవాలకు పకడ్బందీ బందోబస్తు కల్పించనున్నట్లు ఎస్పీ వెల్లడించారు. కమాండ్ కంట్రోల్ రూమ్‌లో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ లాంటి అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా పాయింట్ ఆఫ్ వ్యూలో బందోబస్తు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పార్కింగ్‌పై ముందస్తు ప్రణాళిక సిద్ధం చేయాలని సూచించారు.

ముక్కంటీ.. కనవేంటి!





శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఆదిదంపతుల దర్శనానికి వచ్చే దివ్యాంగులు, వృద్ధుల కోసం బ్యాటరీ వాహనాలను ఏర్పాటు చేశారు. నడవలేని వారిని ఆలయ ముఖ ద్వారం వరకు చేర్చేందుకు నాలుగు గోపురాల వద్ద ఈ వాహనాలను అందుబాటులోకి తీసుకువచ్చారు. అక్కడ నుంచి వీల్‌చైర్‌లో స్వామి, అమ్మవార్ల దర్శనానికి తీసుకువెళుతుంటారు. అయితే ఈ బ్యాటరీ వాహనాలను మాత్రం వీఐపీల సేవలకే వినియోగిస్తున్నారు. దీంతో వృద్ధులు, దివ్యాంగులు ఆలయంలోకి వెళ్లేందుకు నానా అవస్థలు పడుతున్నారు. సామాన్య భక్తులకే పెద్దపీట వేస్తామని ఆర్భాటంగా ప్రకటించే అధికారులు.. ఆచరణలో పూర్తి విరుద్ధంగా నడుచుకోవడంపై పలువురు మండిపడుతున్నారు.
– తొట్టంబేడు

హత్య కేసులో నిందితుల అరెస్ట్



నిందితుల అరెస్ట్ చూపుతున్న సీఐ శ్రీనివాస్

చిల్లకూరు : గూడూరులోని గాంధీనగర్ ప్రాంతం సమాధుల తోట వద్ద జరిగిన రహీద్ హత్య కేసులో నిందితులను పోలీసులు ఆదివారం అరెస్ట్ చేశారు. టూటౌన్ పోలీస్‌స్టేషన్ వద్ద విలేకర్లకు వివరాలను వెల్లడించారు. సీఐ శ్రీనివాస్ మాట్లాడుతూ క్షణికావేశంలోనే హత్య జరిగినట్లు తెలిపారు. ఐదు రోజుల క్రితం ఎస్‌కే రహీద్ బాషా అనే యువకుడి హత్య కేసులో విచారణ చేపట్టామన్నారు. మృతుడి స్నేహితులు పాలకుర్తి వెంకటేశ్వర్లు, ఎస్‌కే షఫీర్ నిందితులుగా గుర్తించామని తెలిపారు. మద్యం తాగిన తర్వాత సిగరెట్ విషయంలో వివాదమేర్పడి హత్యకు దారితీసినట్లు వివరించారు. రహీద్‌ను కత్తితో పొడిచి విషయం వందన అనే మహిళకు తెలియజేయగా, ఆమె వాళ్లకు ఆశ్రయం కల్పించిందని చెప్పారు. హత్యాయుధాన్ని సైతం భద్రపరిచినట్లు తెలిపారు. తర్వాత ముగ్గురూ తూర్పు కనుపూరుకు వెళ్లి వస్తుండగా వరగలి క్రాస్ రోడ్డు వద్ద అదుపులోకి తీసుకున్నట్లు వివరించారు.

తిరుచానూరు స్టేషన్‌కు తొలి రైలు

- నాందేడ్ నుంచి బుధవారం ఉదయం రాక



తిరుచానూరు రైల్వేస్టేషన్

తిరుపతి అన్నమయ్యసర్కిల్ : తిరుపతి–రేణిగుంట మధ్యలో నూతనంగా నిర్మించిన తిరుచానూరు రైల్వేస్టేషన్‌కు తొలి రైలు రానుంది. మంగళవారం సాయంత్రం 4.50 గంటలకు నాందేడ్‌లో బయలుదేరి బుధవారం ఉదయం 11.30 గంటలకు తిరుచానూరు స్టేషన్‌కు చేరుకోనుంది. అదే రోజు సాయంత్రం 6.40 గంటలకు తిరుగుప్రయాణం కానుంది. ఈ క్రమంలోనే నాందేడ్ నుంచి ఈ నెల 23, 30వ తేదీల్లో సైతం ప్రత్యేక వీక్లీ ఎక్స్‌ప్రెస్ రైలు తిరుచానూరుకు రాకపోకలు సాగించనుంది.

టెర్మినల్‌గా మారుస్తూ ..

తిరుపతి, రేణిగుంట రైల్వే స్టేషన్‌లపై ప్రయాణికుల ఒత్తిడి పెరిగిన నేపథ్యంలో తిరుచానూరు రైల్వే స్టేషన్ నిర్మాణానికి 2021లో పనులు ప్రారంభించారు. అనంతరం స్టేషన్ స్థాయిని పెంచి టెర్మినల్‌గా మారుస్తూ నిర్ణయం తీసుకున్నారు. రైల్వే బడ్జెట్‌లో సైతం ఈ స్టేషన్ అభివృద్ధికి ప్రత్యేకంగా నిధులను కేటాయించారు.

కిరణ్ కుమార్‌కు గౌరవ డాక్టరేట్

నాయుడుపేటటౌన్: మండలంలోని 108 అంబులెన్స్‌లో ఈఎంటీగా పనిచేస్తున్న బల్లి కిరణ్ కుమార్‌కు హర్యానాకు చెందిన ఎంబీఆర్ యూనివర్సిటీ ఆదివారం గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. ఎమ్మెస్సీ, బీఈడీ, అడ్వాన్స్‌డ్ డిప్లొమా ఇన్ ఎమర్జెన్సీ చదివి, మెడికల్ టెక్నీషియన్‌గా 19 ఏళ్లుగా 108 అబులెన్స్‌లో ఈఎంటీగా కిరణ్‌కుమార్ విశేష సేవలు అందిస్తున్నారు. సొంత నిధులతో అనేక సేవ కార్యక్రమాలు చేస్తుంటారు. కిరణ్‌కుమార్ సమాజ సేవలను గుర్తించి గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేసినట్లు వర్సిటీ అధికారులు వెల్లడించారు. సుప్రీంకోర్టు న్యాయవాది డాక్టర్ గీతాంజలి శర్మ, సామాజిక వేత్త డాక్టర్ బిందు భార్గవ్, హర్యానా టూరిజం శాఖ జనరల్ మేనేజర్ రాజ్‌పాల్ చేతుల మీదుగా కిరణ్ కుమార్ గౌరవ డాక్టరేట్ అందుకున్నారు.

అధ్వాన్నం.. అవస్థలమయం



గుంతలమయంగా బుచ్చినాయుడుకండ్రిగ-సూళ్లూరుపేట రోడ్డు






రాష్ట్రంలో అద్భుతంగా రహదారులను తీర్చిదిద్దామని ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంటోంది. అయితే క్షేత్రస్థాయిలో రోడ్ల పరిస్థితి అధ్వాన్నంగా తయారైంది. గుంతమయంగా మారడంతో రాకపోకలు సాగించేందుకు ప్రజలు బెంబేలెత్తే దుస్థితి దాపురించింది. ఈ క్రమంలోనే పలు మార్గాలకు మరమ్మతులు చేసినప్పటికీ నాణ్యతలోపించడంతో ఫలితం శూన్యంగా మారింది. అందులో భాగంగా బుచ్చినాయుడుకండ్రిగ– సూళ్లూరుపేట రోడ్డును రిపేర్ చేయాలని సాక్షాత్తు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆదేశించినా ప్రజాధనం వృథా కావడం మినహా ప్రయోజనం లేకుండా పోయింది. సుమారు 14 కిలోమీటర్ల మేర రోడ్డుకు ప్యాచ్‌వర్క్ చేసినప్పటికీ నాసిరకం పనుల కారణంగా మళ్లీ గుంతలమయంగా మారిపోయింది. ఇదే క్రమంలో ఓజిలి మండలం ఇనుగుంట–కోనేటిరాజుపాళెం రహదారి సైతం వాహనదారులకు నరకం చూపిస్తోంది. మోకాటిలోతు గుంతల్లో రాకపోకలు సాగించేందుకు ప్రజానీకం ఆందోళన చెందుతోంది. – బుచ్చినాయుడుకండ్రిగ/ ఓజిలి



గుంతలమయంగా బుచ్చినాయుడుకండ్రిగ-సూళ్లూరుపేట రోడ్డు





ఓజిలి మండలంలో..